# మది నిండుగా ముప్పన్నెల పండుగ

# హైదరాబాద్ వార్త



హైదరాబాద్, అగస్టు 15, ప్రభాతవార్త నగరంలో ముప్పన్నెల శోభ ఆవిష్కృతమైంది. జాతీయ జెండా రెపరెపలాడింది. ముప్పన్నెల జెండా మురిసింది. ఆబాలగోపాలం మా తుఝే సలాం అంటూ ముక్త కంఠంతో నినదించింది. శనివారం 80వ స్వాతంత్ర్య దిన వేడుకలు వైభవంగా జరిగాయి.గోల్కొండ కోటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండాను ప్రతిబింబించే వస్త్రధారణలతో వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.నగర యువత భారీ త్రివర్ణ పతాకాలను చేబూని ద్విచక్ర వాహనాలు, కార్లతో ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్, ట్యాంక్‌బండ్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి తదితర ప్రాంతాల్లో యువకులు దేశభక్తిని చాటారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్,ఎక్స్ తదితర యాప్స్ దేశభక్తిని చాటే పోస్టులతో నిండిపోయాయి. పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు పాల్గొని జాతీయ జెండాకు వందన సమర్పణ చేశారు. సికింద్రాబాద్‌లోని రైల్వే స్పోర్ట్స్ క్లాంప్లెక్స్‌లో ఆర్‌పీఎఫ్ పోలీసులు సాహస విన్యాసాలు చేశారు.











భారీ జాతీయ జెండాతో సికింద్రాబాద్ బాలంరాయి ప్రాంతంలో కస్తూర్భా హైస్కూల్ విద్యార్థుల ర్యాలీ



బేగంబజార్ లో జరిగిన స్వాతంత్ర వేడుకలలో పాల్గొనడానికి వచ్చిన నటుడు సోను సూద్

## త్రివర్ణ శోభితమైన ప్రభుత్వ కార్యాలయాలు



స్వాతంత్ర్య వేడుకల్లో జాతీయ జెండాకు వందనం చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల



జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**హైదరాబాద్, ఆగస్టు 15,ప్రభాతవార్త:** జిల్లా సమగ్రాభివృద్ధికిఅహర్నిశలు కృషి చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అన్నారు. శనివారం కలెక్టరేట్ లో80 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ముందుగా పోలీసులచే గౌరవ వందనం స్వీకరించి తదుపరి అదనపు కలెక్టర్ కదిరవన్ పలని, డిఆర్ఓ డాక్టర్ నారాయణ లతో కలసి జాతీయ పతాకావిష్కరణ గావించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు అభివృద్దే లక్ష్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక కృషి చేయాలనిఅన్నారు. హైదరాబాద్ జిల్లాలోరాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును ఈ సందర్భంగా వివరించారు. అదేవిధంగా వివిధ రంగాల్లో సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో రామకృష్ణ,, సంక్షేమ అధికారులు ప్రవీణ్ కుమార్, అక్కేశ్వరరావు, ఇలియాస్ అహ్మద్, డి ఎం హెచ్ ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి రాజేందర్, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకన్న, ఏవో వెంకట్రామిరెడ్డి, తహసిల్దార్లు, వివిధ శాఖల అధికారులు,ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**జిహెచ్ఎంసిలో జెండా ఆవిష్కరించిన కమిషనర్ ఆర్.వి.కర్ణన్**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా జరుపుకున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు నివాళులర్పించారు. ఈసందర్భంగా ఉద్యోగులు, సిబ్బంది జాతీయ గీతం ఆలపించి, లాంఛనప్రాయ వందనం సమర్పించారు. ఈకారక్రమంలో జీహెచ్ఎంసీ అదనపు కమిషనం పి. ఉదయ్ కుమార్‌తో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సిఎంసి కార్యాయలంలో జెడా ఎగురవేసిన కమిషనర్ సృజన**

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని సిఎంసి ప్రధాన కార్యాలయంలో కమిషనర్ జి.సృజన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈసందర్భంగా కార్పొరేషన్‌లో అంకితభావంతో, ప్రశంసనీయమైన సేవలు అందించిన పారిశుధ్య సిబ్బందిని ప్రశంసా పత్రాలతో సత్కరించారు.

**ఎంఎంసి కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేసిన కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి**

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎంసీ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, త్రివర్ణ పతాకానికి గౌరవ వందనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసీ వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, సిబ్బంది పాల్గొని జాతీయ పతాకానికి వందనం సమర్పించారు. దేశ స్వాతంత్రం కోసం తమ జీవితాలను అంకితం చేసిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

**మెట్రోరైల్ భవన్‌లో స్వాతంత్ర్య వేడుకలు**

రసూల్‌పురాలోని మెట్రో రైల్ భవన్‌లో 80వ స్వాతంత్ర్య దినోత్స వేడుకలు ఘనంగా జరిగాయి. జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివేంద్ర ప్రతాప్ జాతీయ జెండాను ఎగురవేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన హెచ్ఎంఆర్ఎల్ భద్రతా ,పోలీసు అధికారుల నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం అందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో హెచ్ఎంఆర్ఎల్ చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ బి. ఆనంద్ మోహన్, చీఫ్ ఇంజనీర్ వై. సాయప రెడ్డి, జనరల్ మేనేజర్లు డి. సూర్య ప్రకాశం, శ్రీనాథ్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

**టీజీఎస్పీడీసీఎల్ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకలు**

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో గల టీజీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగాలు చేసిన మహనీయులు, స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్ (ఆపరేషన్స్) డా. ఎన్. నర్సింహులు, డైరెక్టర్ (ఫైనాన్స్) చక్రపాణి, డైరెక్టర్ (పాజెక్ట్స్) వి. శివాజీ, డైరెక్టర్ (హెచ్‌ఆర్ ఫైనాన్స్)కృష్ణారెడ్డి, మెద్చల్-మల్కాజిగిరి చీఫ్ ఇంజనీర్, హెచ్‌ఆర్ విభాగం అధిపతి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## యువకళాకారిణుల వైభవ నృత్యవిన్యాసం



సన్మానిత యువ నృత్యకళాకారిణులతో అతిథులు యామినిరెడ్డి,లహరి తదితరులు

**రవీంద్రభారతి, ఆగస్టు 15 ప్రభాతవార్త :**

ప్రముఖ సాంస్కృతిక సంస్థ నృత్యదీక్షాలయ ఆధ్వర్యంలో ప్రఖ్యాత నాట్యగురు లక్ష్మీశంకర్ మార్గదర్శకత్వంలో సుప్రసిద్ధ 5గురు యువ కూచిపూడి నర్తకీమణులు కళోపాసన 2026 (నాల్గవ ఎడిషన్) పేరున ప్రదర్శించిన కూచిపూడి నృత్యవిన్యాసాలు ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి. ఈమేరకు సంస్థ బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ఉత్సవం అలనాటి కూచిపూడి సంప్రదాయాన్ని యువతరానికి చేరువ చేయడంలోపాటు వివిధ గురుపరంపరలకు చెందిన యువకళాకారిణులకు అద్భుత వేదికను అందించి తమ కళాసేవను నిరూపించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కార గ్రహీత యామినిరెడ్డి విశిష్ట అతిథులు లహరి కొలాచాల తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి కళోపాసనను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు 5గురు కళాకారిణులను ఘనంగా సత్కరించి నాట్యవికాస్ అవార్డులు ప్రదానంచేసి శుభాశీస్సులందజేశారు. యువకళాకారిణులు శ్రావణి ముదిరాజ్, సయోజ ఆశ్రిత, రుత్విక, లక్ష్మీరఘునాథ్, శృతిసామన్విలు ఆనందతాండవం, పరులన్నమాట. లక్ష్మీప్రవేశం, ప్రహ్లాద పట్టాభిషేకం, అలోకయే శ్రీబాలకృష్ణమ్, తకంగం, మహాదేవ శివశంభో, చక్కనితల్లికి, భామాకలాపం ప్రవేశ దరువు, ధనశ్రీ తిల్లానా తదితర వైవిధ్యభరి అంశాలను అద్భుత శృతిలయబద్ధంగా హావభావాలను ఒలికిస్తూ ప్రతిభను చాటుకుంటూ చివరిగా అయిదు గురూ కలిసి భారత సామ్రాజ్య సుఖి శీర్షికన ప్రదర్శించిన అంశం ప్రత్యేక ఆకర్షణగా నిలిచి భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటి అందరి ప్రశంసలందుకుంది.



సికింద్రాబాద్‌లో జాతీయ జెండాలతో చిన్నారులు

## రాష్ట్రపతి నిలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు



రాష్ట్రపతి నిలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుక

**అల్వాల్ నగర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**

బొల్లారం రాష్ట్రపతి నిలయంలో స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు అంబరాన్ని తాకాయి. ముప్వెన్నెల జెండాను నిలయం ప్రాంగణంలో మేనేజర్ రజని ప్రియ ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు భారీ తిరంగా ర్యాలీని నిర్వహించడం జరిగింది. జాతీయ గేయాలపనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. దేశ స్వాతంత్ర్య సమరంలో అమరులైన వారి చరిత్రకు సంబంధించి యువతకు అవగాహన కల్పించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా నిర్వహించిన పోటీలులో విజేతలకు రజని ప్రియ బహుమతులు ప్రధానం చేశారు.

## బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో త్రివర్ణ పుష్పాలంకరణ



త్రివర్ణ పతాక రంగులను ప్రతిబింబించేలా వివిధ రకాల పుష్పాలతో అమ్మవారిని అలంకరించిన దృశ్యం

**సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:**

భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలోని మూలవిరాట్ అమ్మవారిని త్రివర్ణ పతాక రంగులను ప్రతిబింబించేలా వివిధ రకాల పుష్పాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. ఈ ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ సాయిబాబా గౌడ్, ఈవో వినోద్ రెడ్డి, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ నాగరాజు, ఆలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



రాజన్నబావి శ్రీ తుల్జా భవాని దేవాలయ ప్రధాన అర్చకులు రంగాచార్య కులకర్ణి ఆధ్వర్యంలో త్రివర్ణ రంగులలో దేదీప్యమానంగా దర్శనమిస్తూ, భక్తులను అనుగ్రహిస్తున్న అమ్మవారు.

## బాలాపూర్ గణేష్‌కు పూరి జగన్నాథ్ మండపం

**సరూర్‌నగర్, ఆగస్టు 15 ప్రభాతవార్త:**

గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, లడ్డూ వేలంలో తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకున్న బాలాపూర్ బొజ్జ గణపయ్య ఈ సారి సుప్రసిద్ధ పూరీ జగన్నాథ్ ఆలయం తరహాలో ఏర్పాటు చేసే మండపంలో కొలువుదీరి కనువిందు చేయబోతున్నాడు. త్వరలో గణేష్ ఉత్సవాలు ప్రారంభంకానున్న నేపథ్యంలో బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఒరిస్సాలోని పూరీ ఆలయం మాదిరిగా మండపాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గతంలో అరుణాచలేశ్వర ఆలయం, విజయవాడ కనకదుర్గ అమ్మవారి దేవాలయం, యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయం, అయోధ్య రామమందిరం తదితర పుణ్యక్షేత్రాల తరహాలో ఏర్పాటు చేసిన మండపాల్లో బాలాపూర్ లంబోదరుడు కొలువు దీరి భక్తులచేత పూజలు అందుకోవడం జరిగింది. బాలాపూర్ గణేష్ ఉత్సవాలకు సంబంధించి లడ్డూ వేలానికి ఎంత ప్రాధాన్యత ఉంటుందో దానికి తగ్గట్టుగా మండపానికి కూడా అంతే ప్రాధాన్యతనిస్తారు. ప్రతి సంవత్సరం ఇక్కడ ఏర్పాటు చేసే వివిధ ఆలయాల తరహా మండపాలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. లక్షలాది రూపాయల ఖర్చును సైతం లెక్క చేయకుండా బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి వారు ప్రతి యేటా కొత్తదనంతో ప్రఖ్యాత పుణ్యక్షేత్రాల మాదిరిగా మండపాలను ఏర్పాటు చేయిస్తూ ఉత్సవాల నిర్వహణలో తమకంటూ ఓ ప్రత్యేకతను, గుర్తింపును కొనసాగిస్తున్నారు.

ఈ యేడాది జరిగే గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పూరీ జగన్నాథ్ ఆలయ తరహాలో ఏర్పాటు చేసే బాలాపూర్ గణేష్ మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.



పూరీ జగన్నాథ్ ఆలయం తరహాలో ఏర్పాటు చేయనున్న బాలాపూర్ గణేష్ మండపం నమూనా

## కబ్జాల నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యం

**-వరదలు లేని నగరంగా తీర్చిదిద్దుతాం**

**-హైడ్రా కమిషనర్ రంగనాథ్**

**హైదరాబాద్, ఆగస్టు 15,ప్రభాతవార్త:**

చెరువులు, నాలాలు, పార్కులు కాపాడి.. పర్యావరణ పరిరక్షణకు రాజ్యాంగ స్ఫూర్తితో అందరం కలసి పని చేద్దామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పిలుపునిచ్చారు. కబ్జాలను నియంత్రించి..ఆక్రమణలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ శాఖలన్నిటితో సమన్వయంగా కలసి పని చేద్దామన్నారు. హైడ్రా కార్యాలయంలో శనివారం జరిగిన స్వాంత్ర వేడుకల్లో జాతీయ పతాకాన్ని హైడ్రా కమిషనర్ ఎగుర వేశారు. ఈసంద్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆస్తులను కాపాడడమనేది అందరి లక్ష్యం కావాలని ఈ క్రమంలో ఎన్ని అవాంతరాలు వచ్చినా.. ఆటుపోట్లు ఎదురైనా వెనుకడుగు వేయకుండా ఈ కార్యక్రమాన్ని ఓయజ్ఞంలా కొనసాగిద్దామన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతంలో పేర్కొన్న విధంగా సుఖశాంతులతో తెలంగాణను సుభిక్షంగా ఉంచేందుకు ప్రజలందరి సహకారంతో కలసి పని చేద్దామన్నారు. పర్యావరణ హితమైన నగర నిర్మాణమే లక్ష్యంగా పని చేయడానికి సంకల్పం తీసుకుందామన్నారు. గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించి వరదలు లేని నగరాన్ని తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేద్దామన్నారు. చిత్తశుద్ధితో పని చేసి ప్రజల మన్ననలు పొందడమే కాకుండా. వారితో శభాష్ అనిపించుకుందామని హైడ్రా కమిషనర్ ఈ సందర్భంగా ఉద్యోగులకు సూచించారు.



స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా


మల్కాజ్గిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్, ఇతర కాంగ్రెస్ నేతలు ఉన్నారు.


స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి


స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకల్లో అక్షర ఇంటర్నేషనల్ స్కూల్స్ సీఈఓ మదన్ మోహన్ రావు , ప్రిన్సిపల్ లక్ష్మీ నాయర్, వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్న దృశ్యం


అజంపుర రాజనర్సింహనగర్‌లో హనుమంతరావు, గుండె రమేష్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో డివిజన్ ఎంఐఎం నాయకులు అబ్రార్ విచ్చేసి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అలీం, సాయికుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



బి.యన్.రెడ్డి. నగర్ డివిజన్ లో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మాజీ కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు


ద్వారాకమయి నగర్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి


ఆఫీసర్స్ కాలనీలో జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేస్తున్న సామ రంగారెడ్డి, గంగం ప్రేమ్ నాథ్ తదితరులు.


శబరిమలై అయ్యప్పస్వామి సేన ఆధ్వర్యంలో గణేష్ టెంపుల్ వద్ద జాతీయజెండాను ఆవిష్కరిస్తున్న బద్దం వినోద్ రెడ్డి, సంజీవ రెడ్డి తదితరులు.


స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నేరేడ్‌మెట్‌లోని అశ్విన్ డయాగ్నొస్టిక్ సెంటర్ ఆవరణలో గిరి గడ్డమీది ఆధ్వర్యంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన దృశ్యం


విజయ హై స్కూల్‌లో స్వాతంత్ర్య దినోత్సవం పాల్గొన్న చైర్మన్ కొప్పునూరి బసప్ప కరస్పాండెంట్ రాజేశ్వర్, డైరెక్టర్ వీణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు


పల్టన్‌లో జాతీయ జెండాను ఎగరవేసిన మాజీ చైర్మన్ బాలకృష్ణ యాదవ్, చిత్రంలో వంశి యాదవ్, శశాంక్ యాదవ్, మహేష్, కార్తీక్ యాదవ్ తదితరులు.


ఎల్ సి హెచ్ కాలనీలో జాతీయ జెండాను ఎగరవేసి వందనం సమర్పిస్తున్న ఎమ్మెల్యే బలాల మాజీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డి, చిత్రంలో ఖాశీం, వెంకటేశం, సూర్యం, ముజ్జు, నాగరాజు, సలీం, వెంకట్ రెడ్డి, కృష్ణలు


ముసారాంబాగ్‌లో జాతీయ జెండాను ఎగరవేస్తున్న బిజెపి భాగ్యనగర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మడిగల లక్ష్మారెడ్డి, చిత్రంలో సామ మల్లారెడ్డి, లింగాల హరి గౌడ్ తదితరులు


జెండా ఆవిష్కరణలో పాల్గొన్న మురుకుంట్ల అరవింద్‌శర్మ


నాగోల్ వాసవి అన్నపూర్ణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అశోక్‌గుప్త ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా


తార్నాక డివిజన్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న టీటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి తదితరులు


తార్నాక డివిజన్‌లో జెండాను ఆవిష్కరిస్తున్న లాలాపేట్ మున్నూరు కాపు సంఘం నాయకులు గర్షమోహన్ తదితరులు


ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, బన్నాల గీత తదితరులు


రామంతాపూర్‌లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్, మాజీ కార్పొరేటర్లు శ్రీవాణి, చేతన తదితరులు


ఉప్పల్‌లో జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి దంపతులు


జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంపై చిన్నారులతో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేసిన మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి


టికెఆర్ కాలేజీలో త్రివర్ణ పతాకానికి అభివాదం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, తీగల హరినాథ్‌రెడ్డి, తీగల అమర్‌నాథ్‌రెడ్డి


నాదర్‌గుల్‌లోని బిజెపి ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకానికి అభివాదం చేస్తున్న మహేశ్వరం ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్


సరూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో జెండా ఎగురవేసిన ఎంఆర్ఓ ,సిబ్బంది



భాష్యం హైస్కూల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొన్న జడ్ఇఒ అంకమ్మరావు, ప్రిన్సిపాల్ స్వర్ణకుమారి, లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ భానుమతి తదితరులు


స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్కాజిగిరిలోని నేరేడ్మెట్ డీసీఎం కార్మికుల అడ్డా, కాకతీయనగర్ భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద త్రివర్ణ పతాకాలను ఆవిష్కరిస్తున్న సిపిఐ నాయకులు

## దేశ సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత



**నేరేడ్‌మెట్ మల్కాజిగిరి కమిషనరేట్ ఆగస్టు 15,ప్రభాతవార్త :** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని మల్కాజిగిరి కమిషనరేట్ సీపీ సుమతి పిలుపునిచ్చారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నేరేడ్‌మెట్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యాలయాల వద్ద మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. మల్కాజిగిరి కమిషనరేట్ కార్యాలయంలో సీపీ సుమతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలన్నారు. స్వేచ్ఛా భారతదేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కులను అనుభవిస్తున్న ప్రజలు తమ బాధ్యతలను కూడా గుర్తించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తోందన్నారు.

## ఇన్వెస్టిచర్ సెర్మనీ విద్యార్థుల నాయకత్వానికి నూతన దిశ : జేడీ లక్ష్మీ నారాయణ


జ్యోతిని వెలిగిస్తున్న లక్ష్మీ నారాయణ

**హయత్ నగర్, ఆగస్టు 15 ప్రభాతవార్త :** విద్యార్థులు విద్యతో పాటు ఆత్మవిశ్వాసం, విలువలతో కూడిన బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని సీబీఐ మాజీ జెడీ లక్ష్మి నారాయణ సూచించారు. వనస్థలిపురం రెసొనెన్స్ స్కూల్‌లో శనివారం ఇన్వెస్టిచర్ వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.... విద్యార్థులు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సమాజం పట్ల బాధ్యతా భావం పెంపొందించు కోవాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యా సంస్థల యాజమాన్యం విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసేలా బోధన చేయాలని సూచించారు. రెసొనెన్స్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ నర్రా పూర్ణచంద్ర రావు, స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.వి.గురురాజ్ మాట్లాడుతూ.. రెసొనెన్స్‌లో విద్యతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, విలువలను పెంచేలా బోధన చేస్తున్నా మన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో అకడమిక్ ఆపరేషన్స్ హెడ్ సుజాత, పరిశోధన, అభివృద్ధి విభాగం అధిపతి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఆర్టీసీ కాలనీలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం



**ఎల్బీనగర్ ఆగస్టు 15, ప్రభాతవార్త**
ఎల్బీనగర్‌లోని ఆర్టీసీ కాలనీలో నిర్వహించిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మాజీ తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ స్వాతంత్రం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య విలువలు, ఐక్యత, సమానత్వాన్ని కాపాడుతూ బలమైన, అభివృద్ధి చెందిన భారతదేశం నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం కాలనీ వాసులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కాలనీ అధ్యక్షులు పెంటా రెడ్డి, ఎఎంసి డైరెక్టర్ పన్యాల జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీపాల్ రెడ్డి, వినయ్ పటేల్, కారుకొండ శివ, రణధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు తన వంతు సహకారం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


ఉప్పల్ ప్రెస్ క్లబ్‌కు టివి అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నేత పి.జితేందర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, ఆగస్టు 15 ప్రభాతవార్త :** జర్నలిస్టులకు తన వంతు సహకారం అందజేస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకుఉ శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు పూడూరు జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా ప్రెస్ క్లబ్ ప్రతినిధులకు టీవీని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సౌకర్యార్థం ఉప్పల్ ప్రెస్ క్లబ్‌కు టీవీ అందించడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు, వారి సౌకర్యాల మెరుగుదలకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో పాత్రికేయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. జర్నలిస్టుల సౌకర్యాల కోసం సహకారం అందించిన పూడూరు జితేందర్ రెడ్డికి, బీఆర్ఎస్ నాయకులకు ప్రెస్ క్లబ్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల తిరుపతిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గ్యారంపల్లి శివాజీ, వర్కింగ్ ప్రెసిడెంట్ పారెల్లి సాగర్, ఉపాధ్యక్షులు ఏవి శ్రీధర్ రావు, కూకుట్ల నరోత్తం రెడ్డి, కోశాధికారి గుత్తి శేఖర్, జాయింట్ సెక్రటరీ దాస రాజుతో పాటు సీనియర్ జర్నలిస్టులు దొంతుల వెంకటరామిరెడ్డి, కొలనుపాక చంద్రమౌళి, పల్లా మహేందర్ రెడ్డి, శ్రీశైలం, కోడికంటి శ్రీనివాస్ బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.


జిల్లెలగూడ గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శనలో చల్లా నర్సింహారెడ్డి, చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, ఏనుగు జంగారెడ్డి

## మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి : సబితా ఇంద్రారెడ్డి


మహిళల స్వయం ఉపాధి కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లెలగూడ ఆర్‌సిఐ రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలోనున్న లయన్స్ భవన్‌లో గీతాంజలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ స్వయం ఉపాధి శిక్షణా కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసి స్వయం ఉపాధి ద్వారా తమ కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. స్థానిక లయన్స్ క్లబ్ సేవలను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్ సురేష్ జగ్నాని, లయన్ మురళి మనోహర్, లయన్ దిలీప్‌కుమార్‌లతో పాటు ఎనుగుల అనిల్ యాదవ్, బొక్కా రాజేందర్‌రెడ్డి, అనితా యాదవ్, పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నల్ల పోచమ్మ ఆలయం ధ్వజస్థంభం ప్రతిష్ఠాపన


ధ్వజ స్థంభం ప్రతిష్టాపనలో పాల్గొన్న ఎం.రజిత పరమేశ్వర్‌రెడ్డి దంపతులు

**ఉప్పల్, ఆగస్టు 15 ప్రభాతవార్త :** ఉప్పల్ శాంతినగర్‌లోని శ్రీ నల్ల పోచమ్మ దేవాలయ విగ్రహ ప్రతిష్ట మరియు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆలయంలో విగ్రహ, సింహ వాహన, బలిపీఠం ,శిఖర ధ్వజస్తంభ, ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి, ఎం.రజితరెడ్డి, సల్ల రాజిరెడ్డి తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ నల్ల పోచమ్మ అమ్మవారి ఆశీస్సులు కృపా కటాక్షాలు, ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఆకాంక్షించారు. అనంతరం అర్చకులు ఆలయ కమిటీ సభ్యులు రజిత పరమేశ్వర్‌రెడ్డి దంపతులను శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కన్నయ్య పంతులు, డివిజన్ అధ్యక్షులు ఈగ ఆంజనేయులు, లింగంపల్లి రామకృష్ణ, బజార్ జగన్నాథ్ గౌడ్, అలుగుల అనిల్, అల్వాల్ భాస్కర్, జనగాం రామకృష్ణ, సురేష్, తుమ్మల దేవి రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, మంద మురళీ కృష్ణారెడ్డి, అఫ్జల్, కుసంగల సతీష్ ముదిరాజ్, ఈగ రాజేష్, సత్తి సత్యనారాయణ, ప్రేమ్ కుమార్, ప్రశాంత్ రెడ్డి, నరేష్ గౌడ్, కన్నమైన నరేష్ ముదిరాజ్, బట్కిరి కుమార్, రంగులు శేఖర్, మోహన్ నాయక్, రేణుక తదితరులు పాల్గొన్నారు.

## బ్యాండ్ బాజాలతో అదరగొట్టిన మహిళా పోలీసులు

-మహిళా పోలీసుల ప్రతిభకు ప్రత్యేక వేదిక..

-తెలంగాణాలో తొలిసారిగా ఆల్ విమెన్ పోలీస్ బ్యాండ్




**నేరేడ్‌మెట్, మల్కాజిగిరి కమిషనరేట్,ఆగస్టు 15,ప్రభాతవార్త :** పోలీసు శాఖలో మహిళా సిబ్బంది ప్రతిభకు మరింత గుర్తింపు లభించింది. తెలంగాణలోనే తొలిసారిగా మహిళా పోలీసులతో కూడిన ప్రత్యేక 'ఆల్ విమెన్ పోలీస్ బ్యాండ్'ను మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రారంభించారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం పోలీసు కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ బ్యాండ్‌ను ప్రారంభించారు. అనంతరం మహిళా పోలీసులు ప్రదర్శించిన బ్యాండ్ ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. పోలీసు విధుల్లో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న మహిళా సిబ్బందిలోని అంతర్లీన ప్రతిభను వెలికితీసి, వారికి ప్రత్యేక వేదిక కల్పించాలనే ఉద్దేశంతో ఈ బ్యాండ్‌ను ఏర్పాటు చేశారు. క్రమశిక్షణ, సమన్వయం, నైపుణ్యం, అంకితభావానికి ప్రతీకగా మహిళా పోలీసులు ప్రదర్శించిన బ్యాండ్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పోలీసు శాఖలో మహిళలు శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ఇతర విభాగాల్లోనూ తమ ప్రతిభను చాటుతున్నారనడానికి ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది. విశిష్ట సేవలకు పోలీసు పతకాలుఇదే కార్యక్రమంలో 2026 సంవత్సరానికి పోలీసు పతకాలు అందుకున్న సిబ్బందిని ఘనంగా సన్మానించారు. విధి నిర్వహణలో విశిష్ట సేవలు, అంకితభావం కనబరిచిన పోలీసు సిబ్బందిని కమిషనర్ బి. సుమతి అభినందించారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు ప్రశంసనీయమన్నారు. మహిళా పోలీసుల ప్రతిభను ప్రోత్సహించడంతో పాటు వారి సేవా స్ఫూర్తికి మరింత బలం చేకూర్చేలా ఆల్ విమెన్ పోలీస్ బ్యాండ్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణ పోలీసు శాఖలో మహిళా సాధికారతకు ఈ కార్యక్రమం మరో ముందడుగుగా నిలిచింది.